# తడి సంతకం

## భమిడి వెంకటేశ్వర్లు

**వచ్చే ఆదివారం కార్తీక సంతర్పణ ఉందని తెలిసినప్పట్నుంచీ ఆ విషయం గురించే ఆలోచిస్తున్నాడు సుధాకరం. కార్తీకమాసం వచ్చి నప్పట్నుంచీ పొద్దున్నే చన్నీటి స్నానాలు, గుడికెళ్లటం, సోమవారం నాడు ఉపవాసం ఉండి రాత్రిపూట భోజనం చేయడం అతని అలవాటు.**



ఇప్పటికి మూడు ఆదివారాలుగా ఏదో ఒక చోట వనసంతర్పణకు వెడుతూనే ఉన్నాడు సుధాకరం. పోయిన ఆదివారాలు స్నేహితులు ఆహ్వానిస్తే వెళ్లాడు. ఇప్పటి ఆదివారం సంతర్పణ చుట్టాలు ఏర్పాటు చేసేది. పైగా దీనికొక విశిష్టత ఉంది. తప్పించుకోవడానికి కారణాలు ఎన్ని వెదికినా అది ఆత్మవంచనే అవుతుంది.

సుధాకరం పద్ధతి వేరు. సంతర్పణకు వెళ్లి భోజనం చేసేసి, చేయి కడిగేసుకుని పెరటిదారిన చిత్తగించడం నచ్చదు. ఈ మూడు ఆదివారాల నిమిత్తం నాలుగు లీటర్ల పెట్రోలు ప్లస్ నిర్వాహకులకు నూట యాభై రూపాయలు ఖర్చు అయినట్లుగా నెల బడ్జెట్టు చెబుతోంది. ఇప్పుడు కరెంటు బిల్లు, నీటిబిల్లు నిమిత్తం ఎనిమిది వందలు చెల్లించేందుకు కిందా మీదా పడుతున్నాడు. దానికి తోడు సీతారామయ్య అండ్ కంపెనీవారు ఎనిమిది శాల్తీలు ఉన్నాయి. తను, గాయత్రి... వెరసి పది తలకాయలు.. అంటే రోజుకు ఇరవై విస్తళ్లు. అరవై కాఫీలు పాపం వీళ్లందరికీ చేయలేకపోతోంది గాయత్రి. ఏం చేయగలదు తను! నగరం చూసేందుకు వచ్చిన తలకాయలు ఇవన్నీ!

అయితే సుధాకరం ఆలోచించేది వేరు. అతిథులు కొంపలో ఉంటే ఆ వ్యవహారం వేరు. ఇప్పుడు వీళ్లు కూడా సంతర్పణకు వస్తామంటారు. ఎలా తీసుకెళ్లాలి. పైగా బోలెడు దూరం. సంతర్పణ జరిగే స్థలం పాతిక కిలోమీటర్ల దూరంలో ఉంది. ఆదివారం నాడు సిటీబస్సులకు నీరసం ఎక్కువ. పైగా బస్సు దిగాక నాలుగు అయిదు కిలోమీటర్లు నడవాలి. లేదంటే ఆటో ఎక్కాలి. ఇన్ని కాళ్లని నడవమంటే మాటలు కాదు. పోనీ ఆటో ఎక్కిద్దామంటే ఎన్ని ఆటోలు కావాలి! తను, గాయత్రి అయితే హాయిగా స్కూటరు మీద వెళ్లి వచ్చేయచ్చు - లీటరు పెట్రోలుతో!

సుధాకరం జేబులు నిండుకున్నాయి. కొంపలో ఉన్న వారికి చెప్పకుండా చెక్కేయడం సంస్కారం కాదు. మాట వరుసకు చెప్పినా 'వస్తా'మంటారు. సీతారామయ్య అండ్ కంపెనీ మనుషులు అన్నింటికీ సిద్ధపడేవారే. కాని రూపాయకు పావలా మాత్రమే ఖర్చుపెట్టే రకం!

సుధాకరం ఇంటికొచ్చేసరికి ఆరుగంటల యింది. గాయత్రి గుమ్మంలోనే ఎదురైంది - భర్తను ఆహ్వానించేందుకు.

"ఏవిటి ప్రసారంలో అంతరాయమా లేక కరెంటు పోయిందా" అని అడిగాడు, తలకాయలు

రోజాలాగా కనిపించకపోయే సరికి.

"గండిపేట వెళ్లారు" అంది గాయత్రి.

"మరి నువ్వెళ్లలేదేం.. లేక రమ్మనలేదా" లుంగీ పంచె అందుకుంటూ అడిగాడు.

'రమ్మన్నారు. పనుందని తప్పించుకున్నాను'

సుధాకరం ప్యాంటు, షర్టు హ్యాంగరుకు తగిలించి, బాత్‌రూముకెళ్లి వచ్చేసరికి కాఫీ తీసుకొచ్చింది గాయత్రి.

"మీకో గుడ్‌న్యూస్" అంది పైగా.

ఆశ్చర్యపోయాడు సుధాకరం "ఏమిటి" అని అడిగాడు వెంటనే.

"రేపు ఆదివారం కార్తీక సంతర్పణ ఉందని ఫోను చేశారు. ఇప్పుడున్న పది తలకాయలతోపాటు మరో అయిదు తలకాయలు లిస్టులో కెక్కాయి' 'అందామె నవ్వుతూ.

షాక్ తిన్నాడు తను. "ఎవరా మహాశయులు' 'అని అడిగాడు కాఫీ తాగుతూ.

చెప్పింది.

'సీతారామయ్యకు తెలిసిందా ఈ విషయం?'

"ఆహా... ఫోను నుంచి రాగానే అడిగాడు. అప్పట్నుంచి సంతర్పణ గురించే టాపిక్ అంతా'

"వీళ్లని కొంపలో పెట్టి మనం వెడితే ఎలా ఉంటుంది"

"ఆ విషయం అలావుంచితే తిరిగొచ్చేసరికి ఇంట్లో టి.వి. టేపు రికార్డరు రేడియో, మంచాలు షేపులు మారిపోయి కొత్త ఖర్చు తగులుకుంటుంది. ఇంటి యజమాని పక్కన లేకపోతే, అద్దెకుండే వాళ్లు ప్రవర్తించినట్లుగా ఈ జనాభా ప్రవర్తిస్తారు.' వివరంగా చెప్పింది గాయత్రి.


ఆలోచనలో పడ్డాడు సుధాకరం.

"ఇప్పుడు ఏంచేయాలంటారు? వెడితే వీళ్లతో శ్రమ, చికాకు, వెళ్లకపోతే వారే మనుకుంటారో" అన్నాడు.

"ఊరికే వెళ్లి తిని వచ్చేయడం కాదు. డబ్బు ఇవ్వాలి కదా... మరి మీ సీతారామయ్యగారు జేబులో చెయ్యి పెడతారా లేక చెయ్యిస్తారా" గాయత్రి అడిగింది.

"వీరి మాట సరే... ఆ అయిదు తలకాయల మాటేమిటి?" సుధాకరం ప్రశ్నించాడు.

"పైకి ఎన్ని కబుర్లు చెప్పినా, డబ్బు లివ్వాలనేసరికి వెనుకడుగు లేస్తారు. వచ్చేరంటే మాత్రం ఎక్కడలేని శక్తి కుడి చేతికి వచ్చేస్తుంది.




ఈ విషయంలో మాత్రం మీరు ముందుగానే నిక్కచ్చిగా చెప్పేసేయండి" సలహా ఇచ్చింది గాయత్రి.

"అయినా మనతో వారంతా ఎందుకు.. వాళ్లెవరో వీరికి తెలియదు. చూడాలనుకుంటే నగరంలో బోలెడు ప్రదేశాలున్నాయి. శ్రమ, చికాకు తప్పుతుంది."

అంతలో వచ్చారు సీతారామయ్య అండ్ కంపెనీ. గేటు చప్పుడుకి కిటికీలోనుంచి చూసింది గాయత్రి. "ఇక వదలండి. మీ యాక్షనుకి అంతరాయం ఏర్పడింది. మీ రియాక్షను వారిమీద అంతగా చూపకుండా లౌక్యంగా చూపండి" అంటూ కాఫీగ్లాసు తీసుకుని బెడ్‌రూములో నుంచి ముందు గదిలోకి వస్తుంటే అడిగాడు సీతారామయ్య" అబ్బాయి వచ్చాడా" అంటూ.

"ఇప్పుడే వచ్చారు" అంటూ వంట గదిలో కెళ్లింది ఆమె.

సీతారామయ్య తిన్నగా బెడ్‌రూములోకి వెళ్లిపోయాడు. వెడుతూనే కార్తీక సంతర్పణ గురించి అడిగాడు. పైగా "మేము రెడీ.. వాళ్లెవరో కూడా వస్తారుట కదా'' అంటూ పాయింటులోకెళ్లిపోయాడు.

సుధాకరం వివరంగా చెప్పాడు "మీరు వచ్చారు కాబట్టి తప్పకుండా సంతర్పణకు వెళ్లాల్సిందే. కాని ఎలా వెళ్లాలన్నదే ప్రస్తుత సమస్య"

"సమస్య ఏమిటి... బస్సు మీద వెళ్లడమే" తేలికగా అన్నాడాయన.

"ఆదివారం సిటీబస్సులు అంతగా ఉండవు. ఎప్పుడొస్తాయో తెలియదు. బస్టాపుల్లో ఆగవు. జనం ఎక్కేదాకా ఉండవు. దిగేదాకా నిలబడవు. పైగా బస్సుదిగాక నడవాలి. ఆటోల మీద వెడితే మరింత ఖర్చు... ఈ వయస్సులో మిమ్మల్ని మరింత కష్టపెట్టడం ఏమిటని ఆలోచిస్తున్నాను"

సీతారామయ్య కూడా ఏదో ఆలోచిస్తున్నాడు.

"మావాళ్లకేదో సర్ది చెప్తాననుకో. వాళ్లెవరో కూడా వస్తామన్నారు కదా... మేము రావటం లేదంటే, ఏమనుకుంటారో కాబట్టి అందరూ వెడితే సరి" అన్నాడాయన.

ఇదీ కరక్టేననిపించింది "మీరు సంఘీనగరు వెళ్లలేదు కదా" అన్నాడు వెంటనే.

"అక్కడెవరున్నారు.. ఎందుకు వెళ్లటం" చటుక్కున అడిగాడు సీతారామయ్య


"సంఘీనగరు ఇక్కడికి నలభయ్ కిలోమీటర్ల దూరం ఉంది. బస్సుమీద హాయిగా వెళ్లిపోవచ్చు. శ్రమలేదు. నడకక్కర్లేదు. ఆటోలు ఎక్కే పనిలేదు. అక్కడ ఇటీవల దేవాలయాలు నిర్మించారు. అక్కడికెడితే పుణ్యం - పురుషార్థం దేవుడిని చూస్తే" అన్నాడతను.

"అక్కడ హోటల్సుంటాయా?"

"హోటల్సుండవు... కోటీలో దిగి హోటల్లో భోజనం చేయాలి. గాయత్రి వంట చేసి ఉంచుతుంది. మీరు ఇంటికి వచ్చి భోజనం చేసేసి హాయిగా విశ్రాంతి తీసుకోవచ్చు" ఊరికేనే అన్నాడు సుధాకరం.

ఎలాగైనా ఈ గ్యాంగుని వదిలించు కోవాలన్నట్లుగా. అసలే చివరి వారం... అందులో రోజా బోలెడంత ఖర్చు.

"పొద్దున్నే గాయత్రి వంట చేయడం, శ్రమ




పడటం, ఏమిటి పైగా మీరు వన సంతర్పణకు వెడుతూ మాకు వంట చేయడం బాగుండదు. అంతా అక్కడికే వెడదాం" తేల్చి చెప్పేశాడు సీతారామయ్య.

ఖంగుతిన్నాడు సుధాకరం.

ఈ ముసలాయన పెద్దాయనే కాదు గట్టివాడే అనుకున్నాడు. అసలే కరువు రోజులు ఈ ఖర్చు తనకు తప్పేట్లు లేదు.

అంతలో గాయత్రి కాఫీలు తీసుకొచ్చింది అందరికీ. కళ్లతో, పెదవులతో డబ్బు గురించి చెప్పమన్నట్లుగా భర్తకు సైగ చేసింది.

సుధాకరం చెప్పసాగాడు "మెటడారు వ్యాను అద్దెకు తీసుకుంటే మనతోపాటే ఉంటుంది. ఓ ఏడెనిమిది వందలు మనవి కాదనుకుంటే సరి. హాయిగా వెళ్లి రావచ్చు. కార్తీక సంతర్పణ నిర్వాహకులకు ఓ అయిదు వందలు ఇస్తే బాగుంటుంది. అన్నట్టు మీరు ఆ మధ్య పొలం అమ్మేశారని తెలిసింది. ఈ కార్తీకమాసంలో యీ విధంగా ఖర్చు పెట్టండి పుణ్యం... పురుషార్థం."

సీతారామయ్య గొంతులో ఎండు ద్రాక్షలు పడిన ఫీలింగు నుదుటి మీద కనిపిస్తుంది.

"బాగానే వుందోయ్. కానీ నేనిస్తానంటే నువ్వు ఇవ్వనిస్తావా... అందుకని మా వాటాగా ఓ వంద యిచ్చేస్తాను. పైగా బస్సు టిక్కెట్లకు ఎంతవుతుందో" సీతారామయ్య అభిప్రాయం అది.

గాయత్రికి ఆయన ధోరణి నచ్చలేదు. ఈ ముసలాడు డబ్బు ఖర్చు పెట్టే రకం కాదన్నట్లుగా తెలుస్తోంది.

"వన సంతర్పణ అంటే కేవలం భోజనం పెట్టేసి పొమ్మనరు. ఉసిరి చెట్టు దగ్గర పూజా కార్యక్రమంతో పాటు కాఫీ టిఫిన్లు ఆహ్వానితులకు ఇస్తారు. మధ్యాహ్నం మళ్లీ ఛాయ్ ఇవ్వడం, సాంస్కృతిక ప్రదర్శనలతోపాటు సన్మాన కార్యక్రమం ఉంటుంది. అక్కడికి దాదాపుగా వెయ్యి మంది దాకా వస్తారు. వచ్చిన వాళ్లు మీలాగా ఆలోచిస్తే ఎవరూ ఏ కార్యక్రమం చేపట్టలేరు."

సుధాకరం మాటలకు అడ్డుపడ్డాడు సీతారామయ్య. "మా తరపున ఈ రెండొందలు ఇవిగో... దారి ఖర్చులకు మరో ఏభై ఇస్తున్నాను. నీకు తెలియనిది కాదు.. సాధారణంగా ఎవరు ఏ కార్యక్రమం చేపట్టినా పేరుకోసమో, గొప్ప కోసమో, సంపాదన కోసమో చేయడం రివాజు. ఇది ఎవరింటి పని! ఎందుకు చేస్తారు? ఎవరిని ఉద్ధరించేందుకు... నీతిగా నలుగురికోసం చేసేవాళ్లూ ఉండచ్చు. అది వేరే విషయం. దాని గురించి మనం ఆలోచించే పనిలేదు" తేల్చేశాడాయన.

ఆశ్చర్యంగా చూశాడు సుధాకరం.

ఆదివారం ఉదయం ఎనిమిది గంటలయింది.

పదిహేను తలకాయలు బస్టాపులో బస్సు కోసం ఎదురు చూస్తున్నాయి. సుధాకరం, గాయత్రి చికాగ్గా వున్నారు. సీతారామయ్య అండ్ కంపెనీతో పాటు మిగిలిన అయిదుగురు కళ్లల్లో ఒత్తులేసుకుని వచ్చేపోయే బస్సులని చూస్తున్నారు.

ఓ అరగంటకు బస్సు వచ్చింది. అంతా ఎక్కారు. గంట తరువాత ఆగింది. అందరూ దిగారు. "ఇపుడు ఎలా వెళ్లడం, ఆటోల్లోనా... నటరాజా సర్వీసా" అని అడిగాడు సుధాకరం తెచ్చుకున్న నవ్వుతో.

"ఆటో కావాలా" అడిగాడు ఒక ఆటోవాడు.

సుధాకరం సీతారామయ్య వైపు చూశాడు ఏం చేద్దామన్నట్లు. ఆయనకు నడవాలనే ఉంది డబ్బు ఖర్చవుతుందని.

"ఓ పని చేద్దాం... నడవలేని వాళ్లని ఆటోలో పంపేద్దాం. మిగిలిన వాళ్లు నడిస్తే సరి" సలహా ఇచ్చింది గాయత్రి.

భార్య సలహా సబబుగానే తోచింది.

మరో ఆటో వారి ముందు నిలిచింది.

రెండు ఆటోల్లోనూ పదిమందిని కూర్చోబెట్టారు.

"ఆటోఫేరు ఏభయ్ రూపాయలు ఇచ్చేయండి, తరువాత లెక్కలు చూసుకుందాం" అన్నాడు సుధాకరం.

నిజానికి సీతారామయ్య ఆటోలోనే ఎక్కాలను కున్నాడు. నడవలేడు. ఎదుటివాడు జేబులో నుంచి డబ్బు ఖర్చు పెట్టించాలనే మనస్తత్వం చాలామంది కుంటుంది. తన డబ్బు అనేసరికి "పరవాలేదు ఎంత దూరమని ఎక్సర్‌సైజుగా ఉంటుంది నడిస్తే" అనే డైలాగులు పేలుస్తుంటారు.

ఆటో వాడికి అడ్రెస్సు స్పష్టంగా చెప్పి పంపాడు సుధాకరం. "గేటు దగ్గర పెద్ద రావిచెట్టు ఉంటుంది. అక్కడే ఉండండి" అని చెప్పాడతను. ఆటోలు కదిలాయి.

సుధాకరం, గాయత్రిలతోపాటు మరో మూడు జతల కాళ్లు రోడ్డు మీద నడవసాగాయి.

అరగంట నడక తరువాత రావి చెట్టు చేరారు. అప్పటికే సీతారామయ్య అండ్ కంపెనీ వారు అక్కడికి చేరుకున్నారు. వన సంతర్పణ స్థలం చాలా హడావుడిగా, సందడిగా వచ్చేపోయే వారితో నిండుగా కనిపిస్తోంది. సుధాకరం అసహనంగా ఉన్నాడు. ఓవైపు ఈ జనాన్ని వేసుకుని బస్సులో శ్రమపడి రావడం... నడవడం మరోవైపు కట్టవలసిన కరెంటు బిల్లు, నీటి పన్ను కళ్లకెదురుగా వెక్కిరిస్తున్నాయి. పైగా ఈ చుట్టాల తాకిడితో నాలుగు రోజులనుంచి ఖర్చు, మరోవైపు గాయత్రితో ఏకాంతానికి కుదరడం లేదు.

టైము పదకొండు గంటలయింది. "చూశారా పాతిక కిలోమీటర్ల దూరం చేరేందుకు యింత టైమయింది తిరిగి ఇల్లు చేరేందుకు ఇంతే టైము అవుతుందో, ఇంకా ఎక్కువ అవుతుందో మరి. ఎవరెక్కడ తిరిగినా మనమంతా ఈ రావిచెట్టు

దగ్గరే కలుసుకోవాలి. సరిగా అయిదు గంటల కైనా బయలు దేరాలి" అంటూ చెప్పాడు.

సీతారామయ్య సుధాకరాన్ని పక్కకు పిలిచి ఓ కవరు చేతిలో పెట్టాడు" ఇందులో రెండొంద లున్నాయి. మిగిలిన వాళ్లు ఎంతిస్తారో తీసుకుని మొత్తం కలిపి నిర్వాహకులకు అందించు" అని చెప్పాడు.

ఇబ్బందిగా అందుకున్నాడు సుధాకరం.

తనతో వచ్చిన వారందరినీ నిర్వాహకులకు పరిచయం చేశాడు సుధాకరం. "ఈసారి సందడి, ప్రోత్సాహం అంత మా సీతారామయ్యగారిదే ఆయనే మాకందరికీ పెద్ద" అంటూ.

సీతారామయ్యకు అలా పరిచయం చేయడం ఎంతో సంతోషాన్ని, గొప్పతనాన్ని, తృప్తిని కలిగించింది. ఈ రోజుల్లో ఎదుటివారినే కాదు, పక్కవాడినే ఎవరూ గుర్తించరు. అభిమానం, ఆప్యాయత జనం నాలుకల్నుంచి చెరిగిపోతు న్నాయి. ఎంతసేపూ స్వార్థం, తనకే పేరురావాలి. తనే నంబర్ వన్‌గా నిలవాలి. తన వెనుక జనం ఉండి తనని ఆకాశానికి ఎత్తాలి తను చెప్పినట్లు వినాలి. తనకు భజన చేయాలి స్తోత్రం చేయాలి. తన మాటలకు చేతలకు వత్తాసు పలకాలి.

తనతోపాటు వచ్చినవారంతా వేదిక మీదకు వెళ్లారు అక్కడున్న వారిని చూసేందుకు. జరుగు తున్న కార్యక్రమాలు వారిని అలరిస్తున్నాయనే చెప్పాలి.

అంతలో సుధాకరాన్ని స్నేహితుడు గోవింద రావు కలిశాడు. అతను అప్పుడే వెళ్లిపోతున్నాడు. "హలో" అంటూ పలకరించాడు స్కూటరు ఆపి.

"ఏవిటి.. రావడం.. వెళ్లిపోవడం... ఎందుకా హడావిడి. భోజనం చేయకుండానా.." అని పలకరించాడు సుధాకరం.

"ఇప్పుడు అంత టైములేదు మరోసారి క్లాసు తీసుకుంటాను. నాకోపని చేసిపెట్టు" అన్నాడు గోవిందరావు.

"ఏమిటి హడావిడి?"

"స్టేషనుకెళ్లి మద్రాసుకు రిజర్వేషను చేయించాలి. అక్కడ ఎంత టైము పడుతుందో... రెండు గంటలకు టీవీ సీరియలు షూటింగు ఉంది. ఏడు గంటలకు పత్రికాఫీసుకెళ్లి ఒక శీర్షిక రాసివ్వాలి. పది గంటలకు గళ్ ఫ్రెండుని బస్సెక్కించాలి. ఇక్కడ హాజరు పడింది కాబట్టి యిక మన పనులు చూసుకోవచ్చు. ఈ కవరు నిర్వాహకులకు అందించుచాలు" అన్నాడు గోవిందరావు టైము చూసుకుంటూ.

"ఏవిటీ కవరు. ఏముంది ఇందులో" అడిగాడు సుధాకరం.

"ఏముంటుంది.. కార్యక్రమానికి నావంతు ఉడతా శక్తి.. అయిదొందలు..."

"మరి నువ్విస్తేనే బాగుంటుంది. లేదంటే మీ ఆవిడ చేత ఇప్పించాల్సింది"

"మా ఆవిడ ఊరికెళ్లింది నేనే వచ్చాను"

సుధాకరం కళ్లు ముందు గోవిందరావు... సీతారామయ్య కనిపిస్తున్నారు. ఆలోచనలు.. అంతరంగాలు ... భావాలు... ఇలాగుంటాయి - కాబోలు!

గోవిందరావు వెళ్లిపోయాడు.

రెండు గంటలకు భోజనాలకు ఆహ్వానం వచ్చింది. మరోవైపు నుంచి ముగ్గురు వ్యక్తులు చందాల కోసం బయలుదేరారు- ఇచ్చి పైకం నోట్ చేసుకునే వాళ్లు, క్యాష్ బ్యాగులో పెట్టుకొనే వాడు. ఇలా జేబుల బరువు తగ్గుతుంటే క్యాషు బ్యాగు బరువెక్కుతోంది.

సాయంత్రం అయిదు గంటలు.

పదిహేను తలకాయలు రావిచెట్టు చేరేసరికి మరో అరగంట పట్టింది. తిరుగు ఆటోలు కూడా ఉండని ప్రదేశం అది. కాబట్టి అంతా రోడ్డెక్కారు. నలభై నిమిషాలకు బస్టాపు చేరారు. సిటీ బస్సులు వస్తున్న జాడ లేదు. వస్తున్నాయి. వెడుతున్నాయి. ఆగటం లేదు ఏవీ. మరో అరగంట కూడా కదిలిపోయింది.

సుధాకరం వాచీ కేసీ చూస్తున్నాడు.

ఓ బస్సు వచ్చింది. జనం ఎల్లాగో జొరబడ్డారు. బస్సు బస్టాపుకు వీడ్కోలు పలికింది.

అందరూ ఇంట్లోకి ప్రవేశించే సరికి తొమ్మిది గంటలు దాటింది. గాయత్రి భర్తవైపు అదోలా చూసింది. ఆ చూపులో ఏదో ఉంది. భర్త పడ్డ శ్రమ, చికాకు ఉంది. ఈ సంతర్పణ కారణంగా ఈ శాల్తీలన్నీ వెంటబడి బస్సెక్కించాయి. లేకపోతే తామిద్దరూ స్కూటరు మీద వెళ్లేవారు. అందరూ సుధాకరాన్ని అభినందించారు.

"అయితే మీకు నేనెప్పుడు అభినందనలు తెలపాలి?" భర్తని అడిగింది గాయత్రి నవ్వుతూ.

"చెప్తాలే" అన్నాడు.

ఆమెకు బోధ పడింది.

సుధాకరం కళ్లముందు కరెంటు బిల్లు, నీటి బిల్లు కనిపిస్తున్నాయి. వాటినిప్పుడు తను చెల్లించగలడు. ఎందుకంటే అతని దగ్గర గోవింద రావు, సీతారామయ్యలు ఇచ్చిన కవర్లు ఉన్నాయి. కరెన్సీ నోట్లకి చెదలు పడతాయా! డబ్బుకున్న ఆకర్షణ, జీర్ణశక్తి కారణంగా ఎటువంటివాడినైనా బలహీనుడిని చేసేస్తుందేమో... మనిషి సృష్టించిన డబ్బు... డబ్బు... ●

